# నాక్కికడ చోటులేదు

**విపుల, 2 జనవరి 1994**



నేనీ ముంబై నగరం వచ్చి సరిగ్గా మూడురోజులైంది. ఆరంతస్తుల బిల్డింగ్‌లో నాలుగో అంతస్తులోని అగ్గిపెట్టెలాంటి ఫ్లాట్‌లో సూర్యుడి కనిపించని పగళ్ళూ, చంద్రుడు కనిపించని రాత్రులూ, గాలిమొహం ఎరగని కిటికీలోంచి మూడుసార్లు వచ్చి వెళ్ళాయంటే నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. రూమ్ ఫ్రెష్‌నర్

వాసన నిండిన గదిలో కూర్చుని నేనదే ఆలోచిస్తున్నాను.

పైన ఫేన్ తిరుగుతోంది. ఎదురుగా ఎయిర్‌కూలర్ ఉంది. తర్వాత వరసగా కలర్ టీవీ, ఫ్రిజ్, గ్రైండర్, మిక్సీ, వాషింగ్ మెషిన్, డిష్‌వాషర్... అన్నీ సుశిక్షితులైన సైనికుల్లా తమ తమ స్థానాల్లో స్థిరంగా వున్నాయి. గది మధ్యలో రెండు సింగిల్ కాట్స్ ఒకవైపు, డైనింగ్ సెట్ మరోవైపు వున్నాయి. ఇంకా పిల్లలు కూర్చుని చదువుకోడానికి వీలుగా డెస్కులున్నాయి. ఏ ఒక్కటీ లేదనిలేదు కానీ యిన్నీ వున్న సరయూ ఇంతకింతా సంతోషంగా వుందా అనేదే ప్రశ్న. జవాబు ఎవరు చెప్పాలి?

సరయూనడిగితే చెప్తుందా?

"నాకేం తక్కువ?" అని ఎదురడుగుతుంది. నిజమే. కన్నవాళ్ళని ఎదిరించి కట్టుబట్టల్తో వచ్చేసినా సరయూకేం కొరతలేదు. కానీ ఈ వున్నవాటిల్లో లైఫుందా? జీవితం వుందేమోగానీ

జీవంలేదు. ఈ నిర్జీవ సైన్యమంతా నా రాకని నిరసిస్తోందేమోననిపిస్తోంది. ఎందుకంటే... నేనంటూ రాకపోతే పగలంతా యీ ఇంట్లో చైతన్యమే వుండేది కాదు. చైతన్యం....

చైతన్యానికి మారుపేరులా వుండే సరయూ ఈ నిర్జీవసైన్యం ముందు కవాతులు చేస్తూ, వాటిచేత చేయిస్తూ.. ఓహ్... యిదేనా ఆనందమంటే? గుండెల్ని మెలిపెట్టేసే బాధ క్రమంగా నా బుర్రలోకి చేరటంతో తల పగిలిపోతోంది.

ఎందుకొచ్చాను నేనిక్కడికి? ఎనిమిదేళ్ళ క్రితం తెగిపోయిన ఈ బంధాన్ని ఎందుకు పునరుద్ధరించాను? ఏమాశించి?

★★★

"అమ్మా...!

ఈ వుత్తరం చూడగానే మీకు కోపం వస్తుందని నాకు తెలుసు. నేను చెయ్యబోయేపనిని మీరుతలవంపులుగా భావిస్తారనీ తెలుసు. కానీ నాకింతకన్నా మరో ఆల్టర్నేటివ్ లేదు. పిల్లలు మనమాట కాదనరనే అపారమైన నమ్మకం పేరెంట్స్‌కి వుండటం సహజమే. వాళ్ళకి యివ్వాల్సినంత స్వేచ్ఛ యిచ్చి, వారి ఆకాంక్షలని గుర్తిస్తే వాళ్ళూ ఆ నమ్మకాన్ని తుంచి వెయ్యరు. కానీ మీరేం చేశారు? నన్నడగకుండా, నా యిష్టాయిష్టాలు తెలుసుకోకుండా, మీ అభిరుచులకు తగిన సంబంధం కుదుర్చుకొచ్చారు.

కానీ అమ్మా,

పదెకరాల పొలం వుండి నాకు యాభై తులాల బంగారం పెట్టగలిగే సంబంధం మీకు గొప్పది కావచ్చు. మీకున్న డబ్బుని తన డబ్బుతో హెచ్చించే వ్యక్తి మీకు గొప్పగా అనిపించవచ్చు. మరి నాకు?

ఈ రోజుని ఎవరూ కూడా పల్లెటూళ్ళ వాకిళ్ళని పట్టుకుని వేళ్ళాడడంలేదు. రెక్కలు కట్టుకుని గగనాంతర విహారానికి వెళ్ళిపోతున్నారు. కంప్యూటర్లు... ఐటీ... అమెరికా.. ఇదే ప్రతివారి గమ్యంగా వుంటోంది.

ఇరవయ్యేళ్ళకే ఒక బాధ్యతగా పెళ్ళిని మోస్తూ ఆ పైన యిద్దరు పిల్లలతల్లై, వాళ్ళని తీర్చిదిద్దుతూ..... ఆడవాళ్ళు ఇంటికీ కుటుంబసేవకీ అంకితమైపోయి కూర్చునే రోజులు కావివి. మనిషి నిరంతర ప్రగతికామి. పెళ్ళితో ఆడపిల్ల ప్రగతి ఆగిపోకూడదు. అలాంటి జీవితం నాకు కావాలి. అందుకే వసంత్‌తో వెళ్ళిపోతున్నాను".

అని వుత్తరం రాసిపెట్టి వెళ్ళిపోయింది సరయూ. ఒకవైపు పెళ్ళిపనులు జరుగుతుంటే మరోవైపు యీ సంఘటన. ఎవరీ వసంత్? ఇద్దరికీ ఎలా పరిచయం? అన్న ప్రశ్నలు మనసుని వేధించాయి.

"అతను మంచివాడే. కానీ మన కులస్తుడు కాదు. దాన్ని మర్చిపో" అని ఆదేశించిన నా భర్త... సరయూ వెళ్ళిపోయిన ఏడాదికే ఈ లోకంలోంచి నిష్క్రమించి, నన్ను వంటరిదాన్ని చేశాడు.

చేసిన పొరపాటు పెద్దదో... చిన్నదో..... దాన్ని సరిదిద్దుకోకపోవడం, కనీసం అలాంటి ప్రయత్నం కూడా చెయ్యకపోవటం యింకా పెద్దది. సరయూ ఆకాంక్షలని మేం గుర్తించలేదు. తన మనసెరిగి ప్రవర్తించలేదు. దేవుడు మనిషికిచ్చేది ఒకే ఒక్క జీవితం. తల్లిదండ్రులమనే కనీసార్హత చేత సరయూ జీవితంమీద హక్కుని మేం తీసుకోవాలనుకున్నాం..

ఏడేళ్ళు నిరాసక్తతో గడిపాను. అంటే సరయూని మర్చిపోయికాదు. నా జ్ఞాపకాల్లోనూ, వూహల్లోనూ తను నిలిచేవుంది. దూరం భౌతికంగానే.

భౌతికమైది వస్తువు. అది మాసిపోతుంది. శిధిలమౌతుంది. ఆఖరికి ఏమీ లేకుండా పోతుంది. అనుబంధం మానసికమైంది. అనుభవం అంతరంగికమైంది. అవి మరుగున పడవు. మనసు చేతనంగా వున్నంతకాలం అవీ చేతనంగానే వుంటాయి. అందుకే సరయూ నిరంతరం మదిలో కదిలే స్మృతైంది.

★★★

ఇంతలో ఒక ఫోను... ముంబైనుంచి, నా మరిది చేశాడు.

"వదినా, ఒక ముఖ్యమైన విషయం చెప్తున్నాను. వినవమ్మా. ఒక ఫ్రెండు కొడుకు పెళ్ళికెళ్తే సరయూ అక్కడికొచ్చింది. అతను కూడా వచ్చాడు. వాళ్ళకిద్దరు పిల్లలు. ముచ్చటైన కుటుంబం..."

ఎదురుచూడని విషయం వింటున్నానేమో, అది కలో, నిజమో అర్ధమవలేదు. పెద్ద కలలాంటి జీవితంలో మరో చిన్న కలా?

"అన్నయ్య పోయాడు. నువ్వా, పెద్దదానివౌతున్నావు. ఇంకా ఎవరికోసం ఈ పంతం?"

అతను అడుగుతుంటే నేను ఆశ్చర్యపోయాను. నాలో వితరణ మేల్కొంది. నాది పంతమా? తిరస్కరించి వెళ్ళిపోయి యిన్నేళ్ళుగా ఒక్కసారేనా కనిపించని సరయూది పంతమా?

"ఇరవయ్యేళ్ల కిందటి విషయమే గుర్తు తెచ్చుకో. బియ్యే చదివీ వుద్యోగం దొరక్క నేను అల్లల్లాడుతున్న రోజులు. ఇక్కడేదో ప్రైవేట్ జాబ్ దొరికిందని సంతోషంగా నేను బయల్దేరితే నువ్వూ, అన్నయ్యా దెబ్బలాడారు. వున్న వూరు వదిలిపోవద్దని వారించారు. మీమాట వినకుండా వచ్చేశాను అలాగని మీరు నన్నొదులుకోలేదు. ఎక్కడ యిబ్బందిపడతానోనని అక్కడి నుంచీ డబ్బు పంపిచేవారు. సరయూ కూడా అదేపని చేసింది. తనకి నచ్చినట్టు జీవితాన్ని మలచుకుంది"

నిజమే! దేవుడు మనిషిచ్చేది ఒకే ఒక జీవితం. దాన్ని అందంగా తీర్చిదిద్దుకోవాలని ఎవరికుండదు? జీవితం సరయూది. అందులో మాకెందుకు చోటుంటుంది? నాలో డిటాచ్‌మెంట్. అదే డిటాచ్‌మెంట్.... ఏళ్ళ తరబడి గడ్డ కట్టుకుపోయి వుంది. మంచులా కఠినంగా... చల్లగా!

"వదినా సరయూ ఇప్పుడిక్కడే ఉంది. మాట్లాడతావా?" నా అనుమతి తీసుకోలేదతను. సరయూకి ఫోనిచ్చాడు.

"అమ్మా..." ఫోన్లో సరయూ గొంతు. అమృతాన్నే వర్షించిందో, బాంబులాగే పేలిందో.... ఏళ్ళ స్తబ్దత తొలగిపోయింది. నేను డిటాచ్‌మెంట్ అనుకుంటున్నది వుద్వేగాల వేడికి కరిగిపోయింది.

"సరయూ! ఎలా వున్నావే? ఇంతకాలం నన్ను చూడకుండా... నాకు కనిపించకుండా" దుఃఖం వుప్పెనలా ఎగదన్నుకొచ్చి ఫోన్ పెట్టేశాను.

తదుపరి పరిణామమే యీ ముంబై ప్రయాణం. మొదటి మజిలీ నా మరిదింట్లో, తర్వాతది సరయూ యింట్లో.

★★★

సరయూ జీవితం!

సరయూ యిల్లు!

సరయూ వ్యక్తిత్వం!

ఈ మూడింటినీ కలిపి ఎనలైజ్ చేస్తే నాకో కొత్త వ్యక్తి కనిపిస్తోంది. నాకు పూర్తిగా అపరిచితురాలైన వ్యక్తి.

'అమ్మా' అని పిలిచి నాలో చైతన్యాన్ని నింపి, నన్ను పునర్జీవితురాలిని చేసిన సరయూ నా ఒళ్ళో తల దాచుకుని తన అనుభూతుల్ని పంచుకోలేదు. అనుభవాలని చెప్పుకోలేదు. మేమ్మిద్దరం మళ్ళీ కలుసుకోవడం సహజపరిణామంలా చూసింది. అందులో ఎలాంటి ఆర్తిలేదు.

సరయూ పరిపూర్ణమైన స్త్రీగా ఎదిగి... తన పుట్టింటి మమకారాలని మర్చిపోయిందా? నాకు వెరపులాంటిది కలిగింది. పెద్దౌతున్నకొద్దీ ఆడవారు పుట్టినింటికి మానసికంగా కూడా దూరమౌతారు. తల్లి సాటి స్త్రీగా కనిపిస్తుందేతప్ప తనకి తల్లిగా అనిపించదు. అది వ్యక్తిత్వ వికాసంలో ఒక భాగం.

సత్రం భోజనం, మఠం నిద్రలాంటి జీవితం ఇక్కడ.

పొద్దున్నే ఆరింటికి వసంత్ వెళ్ళిపోతాడు. అతనికోసం రాత్రే రొట్టెలు చేసి వుంచుతుంది. కొన్ని తిని, కొన్ని బాక్స్‌లో పెట్టుకుని వెళ్ళిపోతాడు. అతను లేవడంతో యింట్లో మొదటి చైతన్య ఘంటిక మోగుతుంది.

తర్వాత సరయూలేచి పనులు మొదలు పెడ్తుంది. వాళ్ళిద్దరిమధ్యా ఇరుగ్గా అనిపించి నేను బాల్కనీలోకి వస్తాను. అక్కడ నిల్చుంటే కింద పరుగులు తీస్తున్న వాహనాలు అగ్గిపెట్టెల్లా... మనుషులు చీమల్లా కనిపిస్తారు. ఇంకాసేపటికి వసంత్, పిల్లలు, సరయూ అందరూ ఆ స్రవంతిలో కలిసిపోయి తమ వ్యక్తిగత అస్థిత్వాన్ని కోల్పోతారు.

ఎక్కడికీ పరుగు? ఎంతకాలం యిలా పరిగెడతారు? అనే ఆవేదన నా గుండెల్లోంచి ఎగదన్నుకొస్తోంది.

వసంత్‌కి బై చెప్పడానికి సరయూ బాల్కనీలోకి వస్తుంది. అతను చెయ్యూపి వెళ్ళిపోయాక, "ఏమైనా చేసేదుంటే చెప్పమ్మా?" అని నేను అడుగుతాను.

సరయూ నవ్వేసి "అన్నింటికీ అన్నీ వున్నాయమ్మా. నేను కష్టపడేదేమీలేదు. ఆ ... మార్కెట్‌లోకి కొత్త రోటీమేకర్ వచ్చింది. అదొకటి తెచ్చుకుంటే వసంత్‌కి వుదయం ఫ్రెష్‌గా రొట్టెలివ్వచ్చు" అంటుంది. మార్కెట్లోకి కొత్తగా వచ్చిన రోటీమేకర్, మరో కాఫీమేకర్. ఇవన్నీ సరయూకి ఆకర్షణలు. వాటి గురించి విస్మయంగా చెప్తుంది.

నేనొచ్చిన మొదటిరోజు చెప్పింది ఇద్దరికీ కలిపి ముప్పయ్యొనిమిది వేలు వస్తుందని. నేను ఆశ్చర్యపోయాను. ఒక సాదాసీదా రైతుకి సంవత్సర ఆదాయం. అంత డబ్బుని వీళ్ళు నెలకి సంపాదించుకుంటారు. ఖర్చు పెట్టుకుంటారు.

పెళ్ళైన వెంటనే యిద్దరూ అమెరికా వెళ్ళారట. అక్కడ మూడేళ్ళుండి తిరిగొచ్చారట. అదీ నాకు ఆశ్చర్యాన్ని కలిగించిన విషయమే. ఎక్కడో కృష్ణాజిల్లాలోని పల్లెటూళ్ళో పుట్టి పెరిగిన పిల్ల. తను ఆశించినదాన్ని సాధించడం!

ఇవన్నీ నాతో చెప్తూ సరయూ కిచెన్‌లోకి వెళ్తుంది. మైక్రో వోవెన్ని సాయంత్రానికి సెట్ చేస్తుంది. లేకపోతే వేక్యూమ్ క్లీనర్‌తో డస్టింగ్ చేస్తుంటుంది. మరోవైపు వాషింగ్ మెషిన్ మోత... ఇల్లంతా యంత్రశాలలా వుంటుంది. మనిషి సుఖజీవనానికి యిన్ని యంత్రాలు అవసరమేనా?

ఆ తర్వాత ప్లేట్లో రొట్టెలు పెట్టుకుని ఐరన్ చేస్తూనో, పిల్లల్ని తయారుచేస్తూనో తింటుంది. ఎనిమిదయ్యేసరికి ఎక్కడివాళ్ళక్కడ హుష్‌కాకి. మళ్ళీ అందరూ యిల్లు చేరేసరికి సాయంత్రం యేడౌతుంది.

టీవీ... వంట...

అంతా రొటీన్ జీవితం.. హ్యూమన్ యిన్‌స్టింక్ట్‌కి చోటులేదు. ఈ ఎనిమిదేళ్ళలో సరయూ

నన్ను మర్చిపోలేదు. గుర్తు చేసుకుని ఏదైనా చెయ్యగలిగేందుకు వ్యవధి వుండి వుండదు. ఎనిమిదికాదు, యింకెన్ని సంవత్సరాలైనా అంతే. నేనొచ్చి అప్పుడే మూడురోజులైందనేదే అందుకు నిదర్శనం.

ఒక్కరోజు వుండడానికి అక్కయ్య మా వూరొస్తే ఎన్నో కబుర్లు చెప్పుకుని, ఎన్నో జ్ఞాపకాలని కలబోసుకునేవాళ్ళం. చేదినకొద్దీ వూరే వూటలా చెప్పుకున్నకొద్దీ యింకెన్నో కబుర్లు దొర్లేవి. అలాంటిది సరయూతో నేను మనసు విప్పి మాట్లాడినదే లేదు. తోడని వూట యింకిపోయినట్టు ఇద్దరం ఎదురుపడ్డా ఏం మాట్లాడుకోవాలో తోచదు.

అసలు వసంత్, సరయూ మాట్లాడుకుంటారా? నవ్వుకుంటారా? ఆరుబయళ్ళూ, వెన్నెలరాత్రులూ వీళ్ళకెక్కడివి? రోజుకి పద్దెనిమిది గంటల పరుగుపందెం అయ్యాక మనసులు అనుభవాలనే తప్ప అనుభూతుల్ని కోరుకుంటాయా? సరయూ జీవితాన్ని నా మనసుతో విశ్లేషిస్తుంటే దారీ తెన్నూ తెలీని కీకారణ్యంలోకి చొరబడ్డట్టుంది.

నా పడక పిల్లల గదిలో. వాళ్ళకెప్పుడూ టీవీ, హోమ్‌వర్క్... పరుగుపందెంలో తల్లిదండ్రుల్ని మించిపోయేలా వున్నారు. స్కూల్నించి వచ్చి, హోమ్‌వర్క్ చేసి, టీవీ చూస్తారు. టీవీ చూస్తునే తిండి. నిద్రొచ్చేదాకా చూసి వచ్చి పక్క చేరతారు. నా రాకతో వాళ్ళ దినచర్యలో స్వల్పమైన మార్పు. టీవీ చూసొచ్చాక కొద్దిసేపు నాతో మాట్లాడతారు.

వాళ్ళకి పుస్తకాల్లో వున్నవీ, టీవీలో చూసిందీ తప్ప వాస్తవానికి సంబంధించిన అనుభవాలేవీ లేవు.

వ్యవసాయాధారమైన దేశంలో... రైతు కుటుంబంలో పుట్టినా విత్తనాన్ని చీల్చుకుని మొక్క మొలవటాన్ని గానీ, పువ్వు పుయ్యటాన్ని గానీ, కాయ కాయటాన్ని గానీ వాళ్ళు చూడలేదు. వాళ్ళకి తెలిసిందల్లా క్రోటన్స్, యిన్‌డోర్ ప్లాంట్స్... వర్షపు చుక్కని చూసినా, కాలికి మట్టి అంటుకున్నా రోగభయమే.

బియ్యం మిల్లుల్లో తయారౌతాయని చెప్పాడు సరయూ కొడుకు. మొక్కలు నర్సరీల్లోనూ, పువ్వులు బజార్లోనూ తయారౌతాయనుకుంటాడు.

మా వూరిగురించి చెప్పాను. ఇంట్లో పండే మామిడిపళ్ళగురించీ, సపోటాలగురించీ, తోటనుంచి వచ్చే చెరుకుగడల గురించీ చెప్పాను. గుత్తులుగుత్తులుగా వూసే గన్నేరు పూలగురించీ, రాత్రి విచ్చుకుని పొద్దున్నే వానజల్లులా రాలిపడే పారిజాతాలగురించీ... ఊరి చివరుండే చెరువుగురించీ...పంట పొలాల గురించీ... గడియారం గూట్లో గూడు కట్టుకున్న పిచ్చికల జంట గురించీ... ఒకటేంటి అవన్నీ చెప్తుంటే ఆశ్చర్యంగా విన్నారు.

జామపళ్ళకోసం చెట్టుమీదవాలే చిలకల గురించి చెప్పగానే

"నాకొక్కటి తెచ్చియ్యవా?" అనడిగాడు.

"ఏం చేసుకుంటావ్?" నేను నవ్వుతూ అడిగాను.

"రెక్కలు కట్ చేసి పంజరంలో పెట్టుకుంటాను" అన్నాడు. వాడి జవాబు నా గుండెల్లో వాడిగా దిగింది. వేలెడంతలేడు ఇప్పట్నుంచీ కండిషన్డ్ లైఫ్ గురించే ఆలోచనలు!

వాడి తప్పేంలేదు. పట్టణంలో స్వేచ్ఛకి ఆస్కారంలేదు. దేనికోసం స్ట్రగుల్ చేసేందుకు వ్యవధి వుండదు. అందుకే అన్నీ తమ కంట్రోల్‌లోనే వుండాలనుకుంటారు. ఆఖరికి ఎదుటివ్యక్తి స్వేచ్ఛ కూడా.

వసంత్ తాతగారి దగ్గర్నుంచీ వాళ్ళ రూట్స్ యీ సిటీలోనే వున్నాయి. నేను చెప్పేవేవీ వాళ్ళు చూసే కార్టూన్ సినిమాల్లో గానీ, హాలీవుడ్ సినిమాల్లోగానీ వుండవు.

"నువ్వే గ్రహం నుంచీ వచ్చావో అడగమంటున్నారు నీ మనవలు" అని చెప్పి నవ్వింది సరయూ తర్వాత. ఒక్క నిముషం ఆగి "నిజమే! వాళ్ళకి కంట్రీ లైఫ్ గురించి ఏమీతెలీదు. ఐనా తెలుసుకోదగ్గంత ఏం వుందిలే? ఈ రోజుల్లో ప్రపంచాన్ని శాశించేది కంప్యూటర్‌గానీ మారుమూల పల్లెటూళ్ళుకాదు" అంది.

అది తెలీనితనమో, అహంభావమో నాకర్థమవలేదు.

"నువ్వు కూడా ఆ పొలాలవీ అమ్మేసి ఇక్కడికొచ్చేయ్యకూడదూ" మళ్ళీ తనే అంది.

"నేనూ?" తెల్లబోయాను.

"ఔను... ఏం? నీకిష్టమైతే మాతోటే వుందువుగాని, లేకపోతే వేరే ఫ్లాట్ తీసుకోవచ్చు. సొంతిల్లుంటే వడ్డీ డబ్బులమీద దర్జాగా బతికెయ్యచ్చు నువ్వు"

నేనా ఆలోచనని ఆమోదించలేకపోయాను. "మా జెనరేషన్ వాళ్ళం చిన్నచిన్న వూళ్ళని పట్టుకుని యింకా వుంటున్నాం కాబట్టి, ఏడాదికో, ఆర్నెల్లకో ఒకసారి మీరటు వస్తే రిలీఫ్‌గా వుంటుంది. అలాంటి రిలీఫ్‌తో యింకో ఆర్నెల్లో, ఏడాదో గడపగలుగుతారు. అందరం యిక్కడే వుంటే... ఒకళ్ళని తోసుకుంటూ ఒకళ్ళం పరిగెడ్తుంటే ఏం బావుంటుంది?" అన్నాను.

"ఏమిటో, నీ ఆలోచనలు...' అంది సరయూ నిరసనగా.

"మా అత్తగార్ని చూపిస్తాను. నీకన్నా పెద్దది. ఎంత యాక్టివ్‌గా వుంటుందో" అంది.

నేను నవ్వి వూరుకున్నాను.

★★★

సరయూ అత్తగారు, మామగారు నన్ను చూడడానికి వచ్చారు. ఆవిడ జాబ్ చేసేదట. రిటైరై ఐదేళ్ళైందని చెప్పింది. తలకి డై చేసింది. పళ్ళు కట్టించుకుంది. పంజాబీ డ్రెస్ వేసుకుంది. ఒకప్పుడు ప్లాస్టిక్ పువ్వులుండేవి ఉపమానానికి. ఇప్పుడు కొత్తగా వెల్వెట్ పువ్వులొస్తున్నాయి. అలా వుంది.

మనసులోంచి వచ్చిన ఆత్మీయతకన్నా తెచ్చిపెట్టుకుని నరాల్లోకి యింకించుకున్న పొలైట్‌నెస్... జీవనశైలిలో యిమిడిపోయిన డిటాచ్‌మెంట్ ప్రస్ఫుటంగా కనిపించాయి.

వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించి వెళ్ళారు. ఆవిడని చూసి నేను బాగా డిస్టర్బ్ అయ్యాను.

...

ఉన్నట్టుండి యింట్లో చిన్న సందోహం.

వసంత్ లక్షపెట్టి కంప్యూటర్ కొన్నాడు. హాల్లోనే దాన్నీ పెట్టారు. ఇప్పటిదాకా కంప్యూటర్ గురించి వినటమేగానీ దాన్నెప్పుడూ చూడలేదు.

సరయూ, వసంత్ దాన్ని తాము సాధించిన మరో విజయంగా చెప్పుకున్నారు. కానీ నాలోమాత్రం గొప్ప అలజడి రేగింది. లక్ష రూపాయలు! దాంతో ఒక సామాన్యుడి జీవితగతిని మార్చెయ్యవచ్చు. అన్నీ కోల్పోయిన వ్యక్తికి పునరుజ్జీవనం కల్పించవచ్చు. ఏ అనాథాశ్రమానికో విరాళమిస్తే కొందరు అనాథలకి తిండి దొరుకుతుంది. ఇంత డబ్బు... కేవలం తమ సంతోషం కోసం ఖర్చుపెట్టుకోవడం... రేప్పొద్దున్న అదీ పాతబడ్తుంది. మళ్ళీ యింకో వస్తువు కొనుక్కొని కొత్త ఆనందాన్ని పొందటం. సుఖ సంతోషాలంటే యివేనా? మౌలికమైన ప్రశ్న! పగలంతా ఆలోచనల్తో నా తలపగిలిపోతోంది.

పిల్లలు కేరింతలు కొడుతున్నారు. ఇంట్లో వాళ్ళ సమయం మరింత కుంచించుకుపోయింది. వచ్చీరాగానే కంప్యూటర్ ముందు చేరిపోతున్నారు. నాతో కబుర్లు చెప్పటంలేదు. కంప్యూటర్ దగ్గరే వుంటున్నారు.

రాత్రి నాకో కలొచ్చింది.

ఇదే యిల్లు. సరయూ యిల్లే. ఇల్లంతా యంత్రాలే వున్నాయి. వాటంతట అవే యిల్లంతా తిరుగుతున్నాయి. అవే అన్నం వండుకుని తింటున్నాయి. పెళ్ళి చేసుకున్నట్టున్నాయి. బుల్లిబుల్లి యంత్రాలు... వాటి పిల్లలు కాబోలు.. వాటిని వెంటేసుకుని తిరుగుతున్నాయి.

సరయూ, వసంత్ ఎక్కడ? పిల్లలెక్కడ? నేను పిచ్చిగా యిల్లంతా వెతుకుతున్నాను. ఎక్కడా కనిపించడంలేదు.

యంత్రాలు నన్ను చూసి హేళనగా నవ్వి, ఓ వారకి చూపించాయి. ఆవగింజలంతంత చిన్న చిన్న వస్తువులు. ఏమిటవి? ప్రాణం వున్నవా? లేనివా?

"నీవాళ్ళు" అందో యంత్రం

"అదేంటి?" దుఃఖంతో నా గొంతు జీరవోయింది. ఎవరేనా వీళ్ళకి శాపం యిచ్చారా?

"వీళ్ళు మెదడుతో బతికే మనుషులంతే. అందుకే మెదడొక్కటే మిగిలింది. మిగిలిన శరీరభాగాలన్నీ పోయాయి. అవేవీ లేవుగా బట్టి మెదడుకూడా చిన్నదైపోయింది" అని ఆ యంత్రమే వివరించింది.

నాకు దుఃఖం ముంచుకొచ్చింది.

"సరయూ... సరయూ....' కలవరించాను.

గట్టిగానే కలవరించానేమో!

"అమ్మా... ఏమిటి? ఏమైంది?" సరయూ తట్టి లేపుతుంటే మెలకువ వచ్చింది. వాస్తవాన్ని గుర్తించడానికి నాకు కొంత వ్యవధి పట్టింది.

కానీ దుఃఖం... నన్ను నిలువునా వూపేస్తున్న దుఃఖం.

వచ్చి యిన్ని రోజులైనా ఒక్కసారి కూడా మనసు విప్పి మాట్లాడలేని సరయూ... భర్తతోటీ, పిల్లల్తోటీ కూడా కాలం గడపలేని సరయూ... మా యింటికి రామ్మా అని తీసుకొచ్చి దుర్భరమైన వంటరితనాన్ని కానుగ్గా యిచ్చిన సరయూ... మనిషి రూపంలో పూర్తి శరీరంతో కళ్ళెదురుగా కనిపిస్తున్నా నాకు కలలో రూపమే గుర్తొచ్చి వణికిపోయాను.

"నేను మనూరు వెళ్ళిపోతాను" అన్నాను.

"ఏమైందమ్మా? ఏం జరిగింది?" అసహనంగా అడిగింది. చాలీచాలని నిద్ర మధ్యలో భంగమైనందుకు తన గొంతులో స్వల్పంగా చిరాకు... నేను పట్టించుకునే స్థితిలో లేను.

"నేనిక్కడ వుండలేను"

"అక్కడేముంది, ఆ పల్లెటూళ్లో?"

"అక్కడ.... మనుషులుంటారు. వాళ్ళు మాట్లాడుకుంటారు. పనులన్నీ వాళ్ళే చేసుకుంటారు..."

నా మాటలకి సరయూ తెల్లబోయి, చూస్తుంటే వసంత్ మా మధ్యకి వచ్చాడు. నా మొహంలోకి సునిశితంగా చూసి, మృదువుగా,

"అలాగే వెళ్ళిపోదురుగాని. నిద్రపొండి" అన్నాడు. అతని గొంతులోని ఆర్ద్రత నన్ను సాంత్వనపరిచింది.

సరయూ మంచినీళ్ళు తెచ్చిచ్చింది. పడుకోమని నాకు మరోసారి చెప్పి వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. అవతలి గదిలోంచి అతని గొంతు లోస్థాయిలో వినిపించింది.

"ఆవిడ యీ ఫాస్ట్‌నెస్ తట్టుకోలేకపోతోంది. ఈ ఇరుకు గదులు... కిక్కిరిసిపోయిన సామాన్లు..... పగలంతా అనుభవించిన వంటరితనం... అన్నిటికీ మించి యిన్ని అప్లయన్సెస్

ఒక్కచోట చూడటం - అన్నీ ఆవిడని కలవరపెడ్తున్నాయి. ఆవిడ రూట్స్ పల్లెటూళ్ళో వున్నాయి. హ్యూమన్ రిలేషన్స్‌లోనూ, ఎటాచ్‌మెంట్స్‌లోనూ వున్నాయి. ఇలాంటిచోట ఆవిడ వుండలేదు"

నేను కళ్ళు మూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నించి కొద్దిసేపటికి నిద్రలోకి జారుకున్నాను.

తెల్లవారిలేచి తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకుంటుంటే సరయూ అంది."అలాగే వెళ్ళిపోదువుగాని. ఇంకొద్ది రోజులుండు. ఊరింకా చూడనేలేదు" అని.

"లేదమ్మా, మళ్ళీ ఎప్పుడో వస్తాను" స్థిరంగా చెప్పాను.

ఈ జీవితం సరయూకోసం మేం అమర్చినది కాదు. తన పెళ్ళి నేను చెయ్యలేదు. తన డెలివరీలప్పుడు నేను దగ్గరలేను. దూదేకుల్లాంటి తన పిల్లల్ని నేనెత్తుకుని ఆడించలేదు. తన పిల్లలకి నాతో ఎలాంటి అనుబంధమూలేదు. అలసిపోయి స్కూలు నుంచి వచ్చి నా వళ్ళో చేరిపోయేంత చేరిక గానీ తీరికగానీ లేవు. వంటిరిగా యింట్లోంచి వెళ్ళిన సరయూని యిలా చూస్తుంటే ఒక అపరిచితురాలిని... కాకపోతే కొద్ది పరిచయం వున్న బంధువుని చూస్తున్నట్టుంది కానీ మరే భావమూ కలగటంలేదు. అందుకే నేనిక్కడ యిమడలేను. ఈ బంధుత్వాన్ని కొనసాగించలేను. నాకు... నాకిక్కడ చోటులేదు.